

నలుగురు వాలంటీర్ల తొలిగింపు

నౌపడ : సంతబొమ్మాళి పంచాయతీలో వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు బుధవారం సివిజిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో నలుగురు వాలంటీర్లను తొలగించినట్లు ఎంపిడిఒ ఉమాసుందరి గురువారం తెలిపారు. సంతబొమ్మాళిలో అధికార వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌తో కల్లూరి పాపారావు, వాదాల దుర్గారావు, అట్టాడ కామేశ్వరరావు, బొమ్మాళ్లి ఉమాశంకర్‌లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం సి విజిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆధారాలను పరిశీలించిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్ వాలంటీర్లను విధుల నుంచి తొలిగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు నలుగురు వాలంటీర్లను పంచాయతీ లాగిన్ నుంచి తొలగించాలని కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

టిడిపిలో అచ్చెన్న చిచ్చు

- రెండు చోట్ల అసమ్మతి నాయకులకు సీట్లు
- 'కళా'కూ టికెట్ రాకుండా చేశారంటూ శ్రేణుల ఆగ్రహం
- సీనియర్లు పోటీలో లేకుండా జాగ్రత్త పడ్డారంటూ విమర్శలు
- అధికారంలోకి వస్తే మంత్రి పదవి దక్కేలా స్కెచ్ వేశారని ఆరోపణ

టిడిపిలో మరోసారి టిక్కెట్ల చిచ్చు రేగింది. ఎచ్చెర్ల సీటుపై ఆశలు పెట్టుకున్న పార్టీ సీనియర్ నాయకుడు కళా వెంకటరావుకు సైతం అధిష్టానం మొండిచేయి చూపింది. ఆ సీటును బిజెపికి కేటాయించడంతో కళా వర్గీయులు మండిపడుతున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో అసమ్మతి నాయకులకు సీట్లు ఇచ్చి ఇన్‌ఛార్జీలను పక్కన పెట్టడంతో అక్కడ పార్టీ శ్రేణులు కుతకుతలాడుతున్నాయి. జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ విడులయ్యే వరకు పార్టీ పరిస్థితి సానుకూలంగానే ఉందని, పార్టీ తీసుకున్న నిర్ణయంతో రానున్న ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లనుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ నేతలకు టిక్కెట్లు రాకపోవడానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడే కారణమంటూ వారు నిందిస్తున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల స్థానానికి బిజెపి విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు పేరును ఖరారు చేసిన జిల్లాకు సంబంధించి కూటమి తరుప పోటీ చేసే అభ్యర్థుల ఎవరనేది తేలిపోయింది. టిడిపి ఏడు స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎచ్చెర్ల సీటును తన మిత్ర పక్షం బిజెపికి కేటాయించింది. 2019 ఎన్నికలతో పోలిస్తే టిడిపి సీట్లలో మూడు చోట్ల మార్పులు చోటు చేసుకున్నాయి. రెండు చోట్ల అభ్యర్థులను మార్చించి. ఒకచోట బిజెపికి ఇచ్చింది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పోటీ చేయగా, ప్రస్తుతం ఆ స్థానాన్ని పార్టీ నాయకుడు గొండు శంకర్‌కు కేటాయించింది. అదేవిధంగా 2019 ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు పోటీ చేయగా, ఇప్పుడు ఆ స్థానాన్ని మామిడి గోవిందరావుకు కేటాయించింది. సీట్ల సర్దుబాటులో భాగంగా ఎచ్చెర్ల స్థానాన్ని బిజెపికి కేటాయిండచంతో గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన టిడిపి సీనియర్ నాయకుడు కళా వెంకటరావు జిల్లాలో ఏకంగా సీటే దక్కని పరిస్థితి వచ్చింది.



పావులు కదిపిన అచ్చెన్న

జిల్లాకు సంబంధించి టిక్కెట్ల కేటాయింపులో అచ్చెన్న మార్కు రాజకీయం కనిపిస్తోందనే చర్చసాగుతోంది. తమకు నేతలకు టిక్కెట్లు రాకపోవడానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడే కారణమనే భావన మూడు నియోజవర్గాల కేడర్‌లో నెలకొంది. టిక్కెట్ల ప్రకటన తర్వాత పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో నిర్వహించిన అసమ్మతి సమావేశాల్లో పార్టీ ఇన్‌ఛార్జీలతో పాటు నాయకులు సైతం బహిరంగానే మాట్లాడటం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. తమకు టిక్కెట్ రాకపోవడానికి అచ్చెన్నాయుడే కారణమంటూ బహిరంగంగానే చెప్పారు. ఆత్మీయ సమావేశాలకు వెళ్లొద్దంటూ అచ్చెన్నాయుడు ఫోన్ చేసిన అంశాన్నీ వారు సమావేశాల్లో ప్రస్తావించారు. ఇప్పుడు తాజాగా ఎచ్చెర్లలో కళా వెంకటరావుకు సీటు కేటాయించకపోవడంతో ఆయన వర్గీయులు కుతకుతలాడుతున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి స్థానాన్ని ఆయనకు కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో పట్టున్న తమ నేతను అక్కడకు పంపడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న తమ పరిస్థితి ఏమిటని నాయకులు ప్రశ్నిస్తున్నారు.

అంతా వ్యూహాత్మకమేనా?

టిక్కెట్ల కేటాయింపు విషయంలో అచ్చెన్నాయుడు ఒక వ్యూహాత్మంగా వ్యహరించారన్న చర్చ నడుస్తోంది. పార్టీకి చెందిన సీనియర్ నేతలను ఒక పద్ధతి ప్రకారం తప్పించడంతో కీలకంగా వ్యవహరించారని అసమ్మతి నాయకులు చెప్తున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే జిల్లా నుంచి మంత్రి పదవికి తన పేరును తప్ప మరొకరి పేరు లేకుండా చేయడమే లక్ష్యంగా ఆయన పావులు కదిపారని వారు అంటున్నారు. సీనియర్ నాయకుడు కళా వెంకటరావును పొరుగు జిల్లాకు పంపడం, శ్రీకాకుళం, పాతపట్నం స్థానాల్లో కొత్త అభ్యర్థులను నిలబెట్టడం అందులో భాగమని వారు చెప్తున్నారు. జిల్లాలో తన కంటూ ఒక ప్రత్యేకవర్గం సృష్టించుకోవాలన్న ఆలోచన అందులో అంతర్లీనంగా దాగుందని వారు అంటున్నారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస ఇన్‌ఛార్జి గౌతు శిరీష, నరసన్నపేట ఇన్‌ఛార్జి బగ్గు రమణమూర్తి మాత్రమే ఆయన చెప్పినట్లుగా నడుచుకుంటున్నారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పాతపట్నం ఇన్‌ఛార్జీలు మాత్రం స్వతంత్ర్యంగా వ్యహరించడం ఆయనకు కంటగింపుగా మారింది. దీంతో పాటు తన వెంట ఇంత మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పుకోవడానికి ఉండాలనే ఉద్దేశంతో ఆయన మాటను ఖాతరు చేయని వారిని తప్పించారనే చర్చ జరుగుతోంది. ఏదేమైనా అచ్చెన్న వ్యవహారశైలితో తమ పార్టీకి నష్టం వాటిల్లే అవకాశాలు లేకపోలేదని పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రూపుల పోరు, ప్రభుత్వంపై వ్యతిరేకతతో గెలుపు కష్టంగా మారిన తరుణంలో టిడిపిలో టిక్కెట్ల చిచ్చు తమకు లాభిస్తుందని మూడు నియోజకవర్గాల వైసిపి నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు.

రీపోల్ అవసరమే రాకూడదు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్

ప్రజాశక్తి- పోలాకి, సారవకోట, జలుమూరు

రీపోల్ అవసరమే రాని ఎన్నికలే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సారవకోట, జలుమూరు, పోలాకి మండలాల్లో గురువారం పర్యటించారు. ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయల్లో ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు, జలుమూరు, పోలాకి మండలాల్లో పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు, అలాగే జలుమూరులో ఎఫ్‌ఎస్టి బృందాల పనితీరును పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులకు కీలక సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రచార కార్యకలాపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. హింసకు తావు లేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా (జీరో వయలెన్స్.. నో రీపోల్), పూర్తి స్వేచ్ఛగా, సజావుగా ఈ దఫా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశాల్లో ఎటువంటి తేడా వచ్చినా అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రచార కార్యకలాపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసే విధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎన్నికలు నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ముందుగానే గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఒ జె.వి.ఎస్.రామ్మోహనరావు, పోలాకి తహశీల్దార్ ప్రసాదరావు, పోలాకి ఎస్ఐ సత్యనారాయణ, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, డిటి పి.శ్రీనివాసరావు, బిఎల్‌ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోలాకి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఒకేషనల్ పరీక్ష రోజే ఎన్నికలపై శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 30న పదో తరగతికి సంబంధించి పలు ఒకేషనల్ కోర్సుల పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అదే రోజున ఉపాధ్యాయులకు ఎన్నికలపై శిక్షణ నిర్వహిస్తుంచనున్నారు. దీంతో అటు అధికారులకు, ఇటు ఉపాధ్యాయులకు ఏమి చేయాలో తెలియక ఇబ్బందులు మదనపడుతున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అదే రోజున నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు జిఒ జారీ చేశారు. వీరిలో చాలామంది ఉపాధ్యాయులు ఒకేషనల్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లుగా, ఇన్విజిలేటర్లగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు విధులను ఒకరోజు ఒకే సమయంలో ఎలా నిర్వహించాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ఏప్రిల్ 1 నుంచి పదో తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం గుడ్ ఫ్రైడే కారణంగా సాధారణ సెలవు ప్రకటించారు. పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిటిఎఫ్ నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు డిఇఒ వెంకటేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. గందరగోళం తొలగించడానికి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఆటంకం కలగకుండా ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లకు ఈ నెల 30న నిర్వహించే ఎన్నికల శిక్షణా తరగతులను నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు

బకాయి వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ మెడికల్ అండ్ సైన్స్ వైద్య కళాశాల (రిమ్స్), ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.మురళి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రిమ్స్ ప్రధాన గేటు వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 7 ప్రకారం ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అతితక్కువ వేతనంతో సెక్యూరిటీ సిబ్బంది దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు పరిష్కరించడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలనెలా వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన, తీసేసిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ అందరికీ సక్రమంగా అమలు చేయాలన్నారు. అధికార యంత్రాంగం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, కార్యదర్శి ఎస్.రాజేంద్ర, కోశాధికారి ఆర్.చిన్నారావు, రిమ్స్ నాయకులు కె.రవికుమార్, జి.అప్పన్న, బి.శ్రీను, రవి, చంద్రశేఖర్, బద్రి, సోమేష్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎలుగు'పై అప్రమత్తం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో ఎలుగు సంచరిస్తూందని ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ అటవీశాఖ రేంజర్ మురళీకృష్ణంనాయుడు రైతులకు, ప్రజలకు సూచించారు. 'ప్రజాశక్తి'లో గురువారం ఎలుగు సంచారం అనే శీర్షికతో వెలువడిన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. పలాస మండలం మామిడిపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు పర్యటించి ప్రజలకు అప్రమత్తం చేశారు. రాత్రి వేళల్లో బయట తిరిగరాదన్నారు. తెల్లవారుజామున వేళల్లో తోటలకు వెళ్లవద్దని సూచించారు. ఒంటరిగా తిరగరాదని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

హుండీ ఆదాయం రూ.43.09 లక్షలు

61 గ్రాముల బంగారం, 1.600 కిలోల వెండి లభ్యం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉన్న హుండీల ఆదాయాన్ని ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో గురువారం లెక్కించారు. గత నెల 27 నుంచి 31 రోజుల పాటు హుండీ ద్వారా రూ.43,09,655 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. నోట్లు రూపంలో రూ.41,45,262 ఆదాయం రాగా, చిల్లర నాణేలు రూ.1,64,393 ఆదాయం సమకూరినట్టు వివరించారు. వీటితో పాటు బంగారం 61 గ్రాములు, వెండి 1.600 కిలోలు, విదేశీ మారకద్రవ్యం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 8 డాలర్లు వచ్చాయని చెప్పారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయక కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారాపు అనురాధ, కోటేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, సినియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

కన్వర్జెన్సీ పనులపై దృష్టి

కలెక్టర్ డాక్టర్ మనజార్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కన్వర్జెన్సీ పనులపై పిఒలు, ఎపిఒలు దృష్టి సారించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్ఆర్ఇజిఎస్‌పై ఎంపిడిఒలతో, పిఒలతో, ఎపిఒలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులపై మరింత దృష్టి సారించాలని ఆదేశించారు. ఒక్కొక్క ఎపిడి పరిధిలో ఏయే పనులు చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఫాంపాండ్స్, డీసిల్టింగ్, ట్రెంచెస్, తదితర పనులు చేపడుతున్నట్లు ఎపిడిలు కలెక్టర్‌కు వివరించారు. మండలాల్లో నిర్ణయించిన లక్ష్యాలు, గ్రామ పంచాయతీల లక్ష్యం, తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. కనీస పని దినాలపై దృష్టి సారించాలని సూచించారు. పనులు చేస్తున్న సమయంలో కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారా? లేదా? షెడ్స్ ఉన్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రథమ చికిత్స తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఎండ తీవ్రతకు సీరియస్ సమస్యలు ఏమైనా తలెత్తిన వెంటనే పీడీకి తెలియజేయాలన్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఫొటోలు తెప్పించాలని ఎపిడిఒలను ఆదేశించారు. జీడి, కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్న ఎపిడిలు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ప్లాంటేషన్ తక్కువగా ఉందని, వాటిని పెంచాలని ఆదేశించారు. అలాగే మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని చెప్పారు. ఎన్నికల నియమావళి ఉన్నందు వల్ల ఎన్ఆర్ఇజిఎస్ విధులు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. వచ్చే సమావేశం నాటికి ఇప్పటి వరకు ప్రారంభించని పనులన్నీ ప్రారంభించాలని ఆదేశించారు. కూలీలకు కూలి చెల్లించడంతో శత శాతం సాధించాలన్నారు. ఎక్కువ పని దినాలు కల్పించాలని చెప్పారు. డ్వామా పీడీ చిట్టిరాజు పనులపై వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఆర్మీ జవాన్‌కు అంత్యక్రియలు



మృతదేహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస : మండలంలోని మోదుగులపుట్టికు చెందిన మద్దిల జోగారావు (40) ఆర్మీ జవాన్‌కు స్వగ్రామంలో అధికార లాంఛనాలు నడుమ గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. జమ్మూకాశ్మీర్‌లోని దంపూర్ యూనిట్‌లో జెసిఒ క్యాడర్‌గా పని చేస్తూ బుధవారం మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. జోగారావు మృతదేహానికి జాతీయ పతాకం కప్పి జమ్మూ-కాశ్మీర్ నుంచి హైదరాబాద్, అక్కడ నుంచి విశాఖపట్నం వరకు ప్రత్యేక విమానంలో తీసుకొచ్చారు. విశాఖ నుంచి మోదుగులపుట్టికు తీసుకొచ్చారు. మృతదేహం ఇంటికి చేరుకున్న వెంటనే భార్య హేమ కుమారి, తల్లి ఆదిలక్ష్మి, కుమారుడు లక్ష్మీవరప్రసాద్, కుమార్తె చాందినీ కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం ఆర్మీ జవాన్లు సమక్షంలో ఎచ్చెర్ల రిజర్వుడు, స్థానిక పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. మృతుడు సోదరుడు ఆర్మీ జవాను మోహనరావు మృతదేహానికి తలకొరివి పెట్టారు. ముందు పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, ఎంపిపి ఉంగ ప్రవీణ, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ వాలంటీర్లపై కోడ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వాలంటీరు వ్యవస్థపై నిఘా మొదలైంది. ఎన్నికల్లో అన్నీ తామై వ్యవహరించాలని, బూత్ ఏజెంట్లుగా వైసిపికి పనిచేయాలని స్వయానా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గతంలో వాలంటీర్లకు బోధించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, మంత్రులు అదే పల్లవిని అందుకుని వాలంటీరు వ్యవస్థను అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ప్రత్యర్థులు ఈ ప్రచారాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవస్థపై సంఘం దృష్టి సారించింది. కోడ్ ఉల్లంఘన పేరుతో ఇప్పటికే కొందరిని తొలగించారు. తాజాగా ఈ వ్యవస్థలో ఉన్న వాలంటీర్లను సాధారణ విధులకు వాడితే ఓటర్లను ప్రభావితం చేయగలరని ప్రత్యర్థులు మరోమారు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వారి వద్ద నున్న టాబ్, సెల్‌ఫోన్, సిమ్ కార్డులను సంబంధితశాఖ కార్యాలయాల్లో జమ చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో వాలంటీర్ల నుంచి వాటిని సేకరించే చర్యలు మొదలు పెట్టారు. మరోవైపు ఎన్నికల వేళ ఏప్రిల్, మే నెల పింఛన్లు లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. సెర్ప్ అధికారులు పింఛన్ల పంపిణీ బాధ్యతలను క్షేత్రస్థాయిలో వాలంటీర్లకు అప్పగించాల్సి ఉంటుంది. రెండు రోజుల ముందే మొదలు కావాల్సి ఉంటుంది. ఈ నెల 30లోగా తాజా పింఛనుదారుల జాబితాతో పాటు నిధులు అందజేయాల్సి ఉంటుంది. ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లు ఆదరైజేషన్ థంబ్ వేసిన అనంతరం లబ్ధిదారులకు పింఛను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆ సమయంలో ఓటర్లను ప్రభావితం చేసే ప్రమాదం ఉంటుందని భావించిన సెర్ప్ అధికారులు ఈ రెండు నెలల పాటు పింఛన్ల పంపిణీకి వాలంటీర్ల ఆదరైజేషన్ పత్రాలను తీసుకోవాలని ఎంపిడిఒలకు, మున్సిపల్ కమిషనర్లకు, పంచాయతీ కార్యదర్శులకు, సంక్షేమ కార్యదర్శుల ఆదరైజేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. పింఛన్ల పంపిణీ సమయంలో వాలంటీర్లు ఎలాంటి ప్రచారం నిర్వహించకుండా ఆదరైజేషన్ పత్రాలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. పంపిణీ సమయంలో ఫొటోలు, వీడియోలు వాలంటీర్లు తీయ కూడదని, నిబంధనను ఉల్లంఘించినట్టయితే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ సెర్ప్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాలంటీర్లలో ఎక్కువ శాతం మంది యువతే కావడంతో కోడ్ ఉల్లంఘన కేసులు నమోదైతే వారి భవిష్యత్‌కు అవరోధం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



తిత్లీ నిధులు కాదు.. సర్దుబాటే!

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తిత్లీ తుపాను బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎటువంటి నిధులను విడుదల చేయలేదు. కేవలం గతంలో చేసిన ఖర్చులకు సంబంధించి అంతర్గత సర్దుబాటు మాత్రమే చేసింది. ఈ నెల 26న రెవెన్యూ డిపార్టుమెంటు జారీ చేసిన మెమోలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. 2018 అక్టోబర్ నెలలో ఉత్తరాంధ్రను తిత్లీ తుపాను వణికించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కలెక్టర్లు తమ వద్ద ఉన్న నిధుల నుండి సుమారుగా 530 కోట్ల రూపాయలను బాధితులను ఆదుకునేందుకు విపత్తుల నివారణ శాఖకు మళ్లించారు. ఈ మొత్తాన్ని తిరిగి తమకు ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని గతంలోనే కోరారు. తాజాగా అప్పట్లో ఖర్చు చేసిన మొత్తాన్ని సుమారు 514 కోట్ల రూపాయలుగా గుర్తించి, ఆ మేరకు సర్దుబాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ తెలిపింది. తిత్లీ బాధిత రైతులు సుమారు 6,700 మంది నష్టపరిహారం కోసం ఇంకా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

42 మందికి ఉద్యోగ నియామకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42 మంది విద్యార్థులు హెట్రో ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. ఈ జాబ్‌మేళాలో 118 మంది అభ్యర్థులు హాజరు కాగా, వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 42 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ఎంపికైన వారికి నియామకపు పత్రాలను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. జాబ్‌మేళాలో జెకెసి కో-ఆర్డినేటర్ వై.మణికుమార్, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఆర్.హరిత, కెమిస్ట్రీ హెచ్‌ఒడి ఆదినారాయణ, కంపెనీ హెచ్ఆర్ జి.రాజు, సిహెచ్.మణికంఠ, జెకెసి మెంటార్స్ ఎన్.దామోదర్, కె.దేముల్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్ దొర

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సోంపేట, కంచిలి బూత్ లెవెల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి డిఎల్‌పిఒ రమణ, సోంపేట, కంచిలి తహశీల్దార్లు విజయ్ కుమార్, రవి, శ్రావణ్ కుమార్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



ఒకేషనల్ కోర్సు విద్యార్థులతో ఉపాధ్యాయులు

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

ప్రజాశక్తి- కవిటి

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని కస్తూరిబా గాంధీ విద్యాలయం (సి.బి.యస్.ఇ) ప్రిన్సిపాల్ పి.లక్ష్మీదేవి అన్నారు. మండలం కొత్తపాలెంలో కెజిబివి పాఠశాల 9వ తరగతి ఒకేషనల్ విద్యార్థులకు కవిటి బిఎస్ఆర్ కళాశాలలో ఐటి, ఐటిఇఎస్ రంగాలపై గురువారం ప్రత్యక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ స్కిల్ ట్రీ కన్సల్టెన్సీ ద్వారా వృత్తి విద్య శిక్షణలో ఉత్తమ విద్యతో పాటు ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షకురాలు బి.సాయిశ్రీ, సహ ఉపాధ్యాయులు ఎం. రోజాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొండు శంకర్

నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంతోపాటు గార, శ్రీకాకుళం మండలాల్లో గడచిన ఐదేళ్లుగా ప్రజల ఇబ్బందులను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పట్టించుకోలేదని , తిరిగి ఓట్లు అడిగేందుకు వస్తున్న ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పాలని టిడిపి అభ్యర్థి గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణాపార్కు కూడలిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీరు, సాగునీరు, మురుగునీరు సమస్య తీవ్రంగా వేధిస్తోందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారిందని, అండర్ డ్రెయినేజీ వ్యవస్థను తీసుకొస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. ఇరుకైన రోడ్ల వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందన్నారు. జిల్లాకే తలమానికంగా ఉన్న కోడిరామ్మూర్తి స్టేడియాన్ని ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయలేదన్నారు. దీనికి తోడు శంకుస్థాపన చేయించి ముఖ్యమంత్రి జగన్ ఫొటోకు పాలాభిషేకం చేయించారన్నారు. ఇంతవరకు నిధులు ఇవ్వకపోగా పనులు అసంపూర్తిగా వదిలేశారన్నారు. అలాగే శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిందని, నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోరాడ హరగోపాల్, పొట్నూరు తులసీరామ్, విస్సు, నాగేంద్ర యాదవ్, అంబటి లక్ష్మీరాజ్యం, పాండురంగ శంకర్ పాల్గొన్నారు.

కలాం ఫౌండేషన్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్న కవిటి మండలం జికరాపాడుకు చెందిన ఎం.లక్ష్మణ్‌కు డాక్టర్ అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ అండగా నిలిచింది. లక్ష్మణ్ పరిస్థితి స్థానికుల ద్వారా తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు గురువారం గ్రామానికి చేరుకుని బాధితుని కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం బాధితుని భార్యకు రూ.10,500 అందించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని, దయనీయ పరిస్థితిలో ఉన్న లక్ష్మణ్ కుటుంబ సభ్యులను మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

జాబ్‌మేళా విజయవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఈ ఇంటర్వ్యూల్లో 40 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ హెచ్‌ఆర్, మేనేజర్ ఫణి శశాంక, శ్రావ్య పాల్గొన్నారు. ఏడుగురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రోబీన్ కుమార్ పాడి తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ అధ్యాపకులు శివకుమార్, భౌతిశాస్త్రం అధ్యాపకులు సంతోష్ కుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగబాబుతో దాసరి భేటీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు పిఎసిఎస్ సభ్యులు నాగబాబు ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుతో భేటీ అయ్యారు. మంగళగిరిలో జనసేన సెంట్రల్ ఆఫీస్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలను కలుపుకొని ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిని గెలిపించే బాధ్యత తీసుకోవాలని చెప్పినట్టు రాజు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని చెప్పినట్లు దాసరి రాజు తెలిపారు.

ఇంటింటా 'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి- బూర్జ

కుటుంబ డ్రామాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువారి గాంధీ అన్నారు. గురువారం మండలంలోని చీడివలసలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో కుటుంబ రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. పైకి విరోధులుగా ఉంటూ రాజకీయం చేస్తున్నారన్నారు. దశాబ్దాలు కాలంగా కుటుంబ రాజకీయాలతో పదవులు పొంది నియోజకవర్గ అభివృద్ధిని వదిలేశారన్నారు. ప్రజలు గుర్తించి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు రాపాక ఎంపిటిసి సూర్యారావు, ఢిల్లీశ్వరరావు, వీరయ్య, రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న గాంధీ

ఓటు వజ్రాయుధం



టెక్కలి రూరల్ : పరశురాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది



నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామైఖ్య సంఘం సభ్యులు



పలాస : ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఓటుహక్కు వినియోగంపై వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలో తలగాం, తేలినీలాపురం, పరుశురాంపురం గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు, మానవహారం నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం గురువెల్లి నారాయణరావు, సిసిలు పద్మ, నీలవేణి, వరదరాజులు, గ్రామైఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక వెలుగు ఎపిఎం ప్రసాదరావు అధ్వర్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండలంలో బూర్జపాడు, మండపల్లి, పాయతారు, సన్యాసిపుట్టుగ, ఈదుపురం గ్రామాల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించు కోవాలన్నారు.

సోంపేట, కంచిలి మండలాల్లో బిఎల్ఒలు, విఆర్ఒలు, విఆర్ఎలు సోంపేట డిగ్రీ కళాశాల నుంచి జింకిభద్ర జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోంపేట డిగ్రీ కళాశాలలో రెండు మండలాల బిఎల్ఒలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికలలో 18 ఏళ్లు నిండిన వారంతా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని అక్కులపేట, తురక పేట, నిమ్మ తొర్లాడ, కుమ్మరి పేట, సీపాన చంద్రయ్య పేట గ్రామాల్లో ఓటుహక్కుపై ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బందితో పాటు గ్రామ సంఘ లీడర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని తహశీల్దార్ పి.రమేష్ బాబు అన్నారు. మండలంలోని షలంత్రి, నక్కలపేటలో ఉపాధిహామీ కూలీలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. మహిళలు శతశాతం ఓటుహక్కును వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ అంబేద్కర్, సిసి సూర్యనారాయణ, ఎపిఎం కమల కుమారి పాండ్యన్, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: అర్హత గల ప్రతిఒక్కరూ విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎపిఎం జాంభవతి అన్నారు. మండలంలోని బోరుభద్ర, కంచి ఊరు, కామధేనువు, కృష్ణరాయపురం, విమలాడ గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన, చైతన్య సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించి ఓటుహక్కుపై వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, గ్రామైఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టెక్కలి: ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ మండలంలోని భీంపురం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎటిడబ్ల్యుఒ ఆర్.కృష్ణవేణి ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం డి.ప్రశాంతికుమారి పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీ గ్రామంలోని పలు వీధుల్లో సాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూల తాతయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సచివాలయ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్, బిఎల్ఒలు లావణ్య కుమార్, జగదీశ్వరరావు, స్రవంతి, రోజా, మున్సిపల్ శాఖ అధికారి వనజాక్షి, ఎన్‌జిఒ నాయకుడు గిరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట పట్టణంతో పాటు బారువ మేజర్ పంచాయతీలో ఓటుహక్కుపై అవగాహన నిర్వహించారు. సోంపేటలో తహశీల్దార్ కె.విజయ్ కుమార్, బారువలో డిఎల్‌పిఒ రమణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు చేపట్టి అనంతరం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ వరప్రసాద్, ఆర్ఐ కె.రవి, విఆర్ఒలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు



టెక్కలి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టిడిపి విస్తృత ప్రచారం



బూర్జ : ప్రచారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు, రవికుమార్

బూర్జ: రాష్ట్రంలో అరాచకపు పాలన కొనసాగించిన ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని పెద్ద పేట పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపించిందన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే మెగా డిఎస్‌సిని ప్రకటిస్తుందన్నారు. ఆముదాలవలస నియోజవర్గ టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ మాట్లాడుతూ సైకో పాలనకు చమర గీతం పాడాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరప్పనాయుడు, మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, రమేష్ పాల్గొన్నారు

పోలాకి: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కొత్తరేవు, జోగం పేట, సొండిపేట, కంబాళివానిపేట, అక్కువరం, పరపతివాని పేట, కొవిరి పేట గ్రామాల్లో పర్యటించారు. టిడిపి విజయమే లక్ష్యంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, రైతు విభాగం అధ్యక్షుడు ఎల్.రాంబాబు, కొత్త రేవు సర్పంచ్ అర్జాల పద్మావతి, మాజీ సర్పంచ్‌లు కొమర సూర్య ప్రకాష్, డోల ప్రసాదరావు, చిట్టి సింహాచలం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని సన్యాసి పుట్టుకలో టిడిపి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న రెడ్డిక వర్గానికి చెందిన పెద్దలు భేటీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడును గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తూ పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డిక నాయకులు ఆశి చిరంజీవులు రెడ్డి, కొండా శంకర్ రెడ్డి, దక్కత ఢిల్లీరావు, లీలారాణి, బొడ్డా మణిచంద్రప్రకాష్ రెడ్డి, జనసేన నాయకులు దుర్యోధన రెడ్డి, పరశరాం రెడ్డి, సాడి సహదేవ్ రెడ్డి పాల్గొన్నారు.

కవిటి: మండలం రాజపురం పంచాయతీలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే అశోక్ భార్య నీలోత్పల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాలం రమేష్, సీపాన వెంకటరమణ, పుల్లట సంతోష్, పిన్నింటి కార్తీక్, చందు, హేమాచలం, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస: మందస మండలం బాలిగాంలో టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలిగాం గ్రామ కమిటీ అధ్యక్షుడు బావన ఢిల్లీశ్వరరావు, మండల నాయకులు తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, ముదుముంచి నవీన్ కుమార్, గున్న విక్రమ్, తలగాన పాపారావు, జోగారావు పాల్గొన్నారు.



పోలాకి : గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న రమణ మూర్తి తదితరులు

కోటబొమ్మాళి: మండలం చీపుర్లపాడులో టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, విజయలక్ష్మి, వెలుగు మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు గొండు లక్ష్మణరావు, చల్ల రాము, సింహాచలం, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, శ్రీనివాస్, రమణమ్మ, ఆనందరావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పొందూరు: రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి సంపూర్ణ విజయం అందించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కె.రామ్మోహన్నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో గాంధీనగర్ వీధికి సమీపంలో దళితవాడలో కె.రాజేష్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు రామ్మోహన్‌నాయుడు, రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్, చినరంగ బాడాన గిరి, ఎంపిటిసి వాణి పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం



ఇచ్ఛాపురం : ఓటర్లుతో మాట్లాడుతున్న విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం బిర్లంగి గ్రామ పంచాయతీలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం బిర్లంగి, తోటూరు, సైదాల పుట్టుగ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధితో మంచిపాలన అందిస్తున్నారన్నారు.నెమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కారింగి మోహనరావు, నూకయ్య రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు

పలాస: మండలం బొడ్డపాడు, బొడ్డుపాడు కాలనీ, మామిడిపల్లి గ్రామాల్లో గురువారం వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో పలాస అభ్యర్థి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, సర్పంచ్ తామడ మధన్, ఎంపిటిసి మద్దిల పాపారావు, సైని దేశయ్య, సొర్రా తిరుపతిరావు, గేదెల సూర్యారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్, ఎంపిటిసి గొండు మోహనరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : అక్కయ్యవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

కోటబొమ్మాళి: మండలంలో అక్కయ్యవలస పంచాయతీ సర్పంచ్ సుంకరి జనార్ధనరావు ఆధ్వర్యంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, వైసిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, నాయకులు కవిటి రామరాజు, పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పనుల పూర్తికి కృషి చేశా

తిరుమరెడ్డి శ్రీనివాస్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్, శ్రీకాకుళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అర్‌బ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో తాగునీరు ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రజలకు నీరు అందించడంలో సంతృప్తినిచ్చిందని శ్రీకాకుళం ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమలరెడ్డి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. విజయనగరం జిల్లా సాలూరు పట్టణానికి చెందిన శ్రీనివాస్ ప్రసాద్ తండ్రి రైల్వే ఉద్యోగి కావడంతో విశాఖపట్నంలో 1962, మార్చి 27న ప్రభాకరరావు, ప్రభావతి దంపతులకు రెండో సంతానంగా జన్మించారు.

విద్యాభ్యాసం

1967లో విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెంలోని విజ్ఞానికేతన్ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు అక్కడే చదివారు. 6,7 తరగతులు విశాఖపట్నం ద్వారకానగర్‌లో మున్సిపల్ యుపి స్కూల్‌లో చదివారు. అదే జిల్లా రైల్వే కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 నుంచి పదో తరగతి చదివి 1977లో పూర్తి చేశారు.

అల్లిపురం జంక్షన్ విశాఖపట్నం జిల్లా బివికె కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1979 నుంచి 1983 వరకు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో డిగ్రీ పట్టా పొందారు.

ఉద్యోగ జీవితం



తిరుమరెడ్డి శ్రీనివాస్‌ప్రసాద్

1986లో విజయ నగరం పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌లో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1992 వరకు విజయనగరం సబ్ డివిజన్, సర్కిల్ కార్యాలయంలో పనిచేశారు. 1994లో కొత్తవలస, ఎస్.కోట సబ్ డివిజన్లలో పనిచేశారు. 1997లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలో పనిచేశారు. అదే సమయంలో తూర్పుగోదావరి జిల్లా కోనసీమ తాగునీటి ప్రాజెక్టు, శ్రీకాకుళం జిల్లా ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణాలకు సర్వే చేసి నివేదిక పంపించారు.

2002లో విశాఖపట్నంలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇగా 2007 వరకు పనిచేశారు. 2008 పంచాయతీరాజ్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్‌కి విభజన జరిగిన తర్వాత విజయనగరంలో క్వాలిటీ కంట్రోల్ డిఇఇగా పనిచేశారు. 2012లో విశాఖపట్నంలో ఆర్‌డబ్ల్యుఎస్ క్వాలిటీ కంట్రోల్ డిఇఇగా పనిచేశారు. 2014 నుంచి 2016 వరకు జిల్లాలోని పలాస సబ్ డివిజన్‌లో ఇఇగా ఉద్యోగోన్నతి పొందారు. 2018లో ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటేషన్‌పై పనిచేశారు. 2022 ఆగస్టు నెలలో ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి పొంది ఈ నెల ఆఖరి వరకు సేవలందిస్తున్నారు.

సంతృప్తిరించే అంశం

38 ఏళ్లలో ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్‌లో విజయనగరం, సీతానగరం, ఎస్.కోట సబ్ డివిజన్లలో తాగునీటి ప్రాజెక్టులకు సర్వే చేసి ప్రతిపాదనలు పంపించా. ఇది ఉద్యోగ జీవితంలో మిక్కిలి సంతృప్తినిచ్చింది. కర్నూలు ఎయిర్ పోర్టులో పనులు ప్రారంభించి పూర్తి చేయడమూ ఆనందంగా ఉంది.

ఉద్యమం నేపథ్యం

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల సంఘంలో సభ్యునిగా అనేక పోరాటాలు చేశారు. ముఖ్యంగా సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

అవార్డులు

పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో, ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్‌లో ఉత్తమ సేవలు అందించినందుకు విజయనగరం జిల్లాలో మూడు జిల్లాస్థాయి ఉత్తమ అధికారుల అవార్డులు, విశాఖపట్నం జిల్లాలో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. అలాగే ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అప్పటి ఎండీ భరత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఇంజినీర్ అధికారిగా అవార్డు అందుకున్నారు.

కుటుంబ నేపథ్యం

భార్య తిమ్మారెడ్డి మాధవి, పెద్ద కుమారుడు వివేక్, కోడలు లలిత్యాలు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మనవడు సౌరి ఉన్నారు. చిన్న కుమారుడు ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- నందిగాం

మండలం పెద్ద తామరపల్లికి చెందిన 22 ఏళ్ల కోనారి మాధవి ఈనెల 23న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి మహాలక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీపురం శివాలయంలో పగలుగొట్టిన తాళాలు

పలు ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి- పలాస

మండలం బ్రాహ్మణతర్ల, లక్ష్మీపురం, బంటు కొత్తూరు గ్రామాల్లో శివాలయం, కాటమ్మ తల్లి, మంకినమ్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయాల తాళాలు పగలు కొట్టి గర్భగుడిలో చొరబడి వెండి, ఇత్తడి ఇతర వస్తువులను దొచుకుపోయారు. అయితే గురువారం ఉదయం ఆయా గుడుల అర్చకులు ఆలయాలు తెరిచేందుకు వచ్చేసరికి ఆలయాలు తలుపులు తెరిచి ఉండడం చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆలయ గర్భగుడి లోపలికి వెళ్లి చూడగా లక్ష్మీపురం శివాలయంలో సిసి కెమెరా విద్యుత్ తీగలు కత్తిరించి శివ లింగంపై ఉన్న వెండి నామాలు దొంగిలించారు. అలాగే బ్రాహ్మణతర్ల కాటమ్మ తల్లి ఆలయంలో హుండి కొట్టి అందులో ఉన్న నగదును దోచుకున్నారు. హుండీని సమీపంలో పారేశారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జెకెసి, జిఎంఆర్ సెక్యూరిటీ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నుంచి 35 ఏళ్లలోపు యువతీ, యువకులు జాబ్‌మేళాకు హజరు కావచ్చునన్నారు. డిప్లమా చేసిన మహిళలకు అవకాశాలున్నాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాకు హజరు కావాలన్నారు.

ఎంపీ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం యలమంచిలిలో జరుగుతున్న దుర్గాదేవి 15వ వార్షికోత్సవంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామ్మోహన్‌నాయుడు వచ్చారని తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, తెలుగు మహిళ అధ్యక్షులు పూజారి శైలజ, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి లైన్ పనుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మైంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో బొర్రపుట్టుగ, తొత్తిడిపుట్టుగ, కవిటి, కొత్తూరు, గొండ్యాల పుట్టుగ, ప్రగడ పుట్టుగ గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- పాతపట్నం

టిడిపి బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు గురువారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ తనను గెలిపిస్తే పాతపట్నం నియోజవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సలాన మోహనరావు, గేదెలు చైతన్య, కూటమి నాయకులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఒఎన్‌డిసిపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: ఒఎన్‌డిసి ప్లాట్ ఫారంపై అవగహన కలిగి ఉండాలని ఎపి మానవ వనరుల అభివృద్ధిశాఖ మాజీ చైర్మన్ చక్రపాణి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ అండ్ లీడర్షిప్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. దేశంలోని వివిధ వ్యవస్థల్లో ఉపాధి అవకాశాలు పొందడానికి రాయాల్సిన పరీక్షలు, వాటి కోసం ఎలా సంసిద్ధం కావాలన్న అంశాలను వివరించారు. అమెరికా ఉత్పాథక కంపెనీల్లో అందిస్తున్న ఇంటర్నషిప్ ప్రోగ్రామ్ గురించి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డిజిటల్ లిటరసీ తప్పక అవసరమన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారని అన్నారు. పాల్గొన్న విద్యార్థులకు రూ.12 వేల స్టైఫండ్ అందజేస్తారని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందు కోసం నిరంతరం పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. భావవ్యక్తీకరణ, నైపుణ్యాభివృద్ధి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ జయదేవ్, కళాశాల ఐక్యుఏసి డాక్టర్ హరిత, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రదీప్ పాల్గొన్నారు.

వెంకన్న చౌదరి జన్మదిన వేడుకలు

పలాస: టిడిపి కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గురిటి సూర్య నారాయణ, మల్లా శ్రీనివాసరావు, నర్సింహులు, సప్ప నవీన్, పాండు రంగారావు, ఆత్మారావు, శంకర్, అనిల్ శర్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న బాబూరావు